పాత కలెక్టరేట్‌కు పూర్వ వైభవం తేవాలి

కడప కార్పొరేషన్: పాత కలెక్టర్ కార్యాలయానికి పూర్వ వైభవం తేవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. శుక్రవారం స్థానిక పాత కలెక్టరేట్‌ను ఆయన పరిశీలించారు. పాత కలెక్టరేట్‌లోని ప్రతి గదిని పరిశీలించి పూర్వం వినియోగించిన లైమ్ ప్లాస్టింగ్‌తోనే గోడలు సీలింగ్ మరమ్మతులు చేయాలని సూచించారు. టోపోగ్రఫీ సర్వే చేయించి మ్యాప్ సమర్పించాలని పంచాయితీ రాజ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పాత కలెక్టరేట్‌లోని సామాగ్రికి సంబంధించి ఒక రిజిస్టర్ నిర్వహించాలని, సామాగ్రినంతా వేరొక చోటికి మార్చాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

మార్నింగ్ విజిట్‌లో భాగంగా కమిషనర్ టీజీపీ పార్కు, భగత్‌సింగ్ నగర్ పార్కు, యర్రము క్కపల్లె జంక్షన్, గాంధీ ప్లాజా, దేవునికడప ప్రాంతాలను పరిశీలించారు. టీజీపీ పార్కులో ఎంట్రెన్స్ గేట్, ఆర్చి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. పార్కులోని చెట్లను తొలగించకుండా పాత్ వే తయారు చేయాలన్నారు. భగత్ సింగ్ నగర్ యు పి హెచ్ సి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని 15 రోజులలో స్లాబ్ వర్క్ పూర్తి చేయా లని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎర్రముక్కపల్లె జంక్షన్‌ను డిజైన్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. 15 రోజులలో గాంధీ ప్లాజా సిద్ధం చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టి ఎల్ ఎఫ్ బిల్డింగ్ నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్ ఆఫీసు రూమ్, మీటింగ్ హాల్ గోడలకి గ్లాస్ ఏర్పాటు చేయాలని సూచించారు. మీటింగ్ హాల్‌లో ప్రొజెక్టర్, మైక్ స్పీకర్స్ ఏర్పాటుకు సంబంధించి ఎలక్ట్రికల్ కనెక్షన్ ఫ్లోరింగ్ నుండి తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



పాత కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

భక్తిశ్రద్ధలతో అన్నమయ్య జయంతి



అన్నమాచార్యుల విగ్రహం వద్ద భక్తులు

కడప కల్చరల్ : పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి వేడుకలను కడప నగరంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మున్సిపల్ మెయిన్ హైస్కూల్ ఎదురుగా పునర్నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన అన్నమాచార్య విగ్రహం వద్ద ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కూడలిని పూలు, అరటి పిలకలతో నయన మనోహరంగా అలంకరించారు. అన్నమయ్య విగ్రహానికి నిలువెత్తు పూలమాలను అలంకరించి పూజలు నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిపై 32 వేల కీర్తనలు రచించి గానం చేసి తరించిన అన్నమయ్య సేవలను అందరూ గుర్తు చేసుకున్నారు. పాత విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, ఆ సర్కిల్‌ను అందంగా తీర్చిదిద్దినందుకు పునర్నిర్మాణ సంఘం సభ్యులు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బండారు శివ కేశవ, కొవ్వూరు మస్తాన్ రావు రాయల్, అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు, బాలకృష్ణ యాదవ్, వీవీ చలపతి, రెడ్డిప్రసాద్, బండారు సత్యనారాయణ, ఆర్యవైశ్య ప్రముఖులు మునగా సతీష్, మాజీ మహిళా కార్పొరేటర్లు పత్తి రాజేశ్వరి, బండారు నాగమల్లిక, పట్టాభి రామయ్య, బలిజ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'తాళపత్రాల డిజిటలైజేషన్' బ్రౌన్‌కు అప్పగింత

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం డిజిటలైజేషన్ చేసిన తాళ పత్ర గ్రంథాలను తిరిగి అందజేసింది. తాళపత్రాల పరిరక్షణ విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాటిని డిజిటలైజేషన్ చేసి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి శుక్రవారం అప్పగించింది. యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయంతో గత సంవత్సరం అక్టోబరు 10వ తేదిన ఈ అంశంపై ఎంఓయూ చేసుకున్నది. అందులో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య సూచనలు చేశారు. ఈ మేరకు బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి గ్రంథాలయంలోని తాళ పత్రాల డిజిటలైజేషన్ కోసం 288 తాళ పత్రగ్రంథాలను టీటీడీ వేద విశ్వవిద్యాలయానికి అందచేశారు. డిజిటలైజేషన్ అనంతరం వాటికి సంబంధించిన పెన్ డ్రైవ్‌ను టీటీడీ వేదిక్ యూనివర్శిటీ వీసీ ఆచార్య రాణి సదాశివ మూర్తి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి తన కార్యాలయంలో అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఓయూ ప్రకారం గ్రంథాలను ఉచితంగా క్లీనింగ్, ఆయిలింగ్, ఇంకింగ్ చేశారని, అన్ని వివరాలతో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారని తెలిపారు. దీంతో తాళపత్ర గ్రంథాల మన్నిక ఎన్నో రెట్లు పెరుగుతుందని తెలిపారు.

బిల్లుల సమర్పణకు అవకాశం కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: పీఆర్సీకి ముందు చెల్లించాల్సిన డీఏ బకాయిల బిల్లుల చెల్లింపునకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా ఖజానాశాఖ ఉపసంచాలకులు వెంకటేశ్వర్లును కలిసి యూటీఎఫ్ శాఖ తరుపున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన జులై 2018 నుంచి జూన్ 2021 వరకు సంబంధించిన పది విడతల డీఏ అరియర్స్ బిల్లులు అనేక మార్లు ఖజానాశాఖకు సమర్పించినప్పటికీ వాటిని ఆమోదించకపోవడం వల్ల ప్రస్తుతం తిరిగి బిల్లులు సమర్పించుటకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి రమణ, ఆడిట్ కమిటి కన్వీనర్ ప్రభాకర్, నాయకులు బత్తుల చంద్రశేఖర్, లక్ష్మి నారాయణ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



ఖజానాశాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సైన్స్‌తో మూఢ నమ్మకాలు దూరం

కడప కల్చరల్ : సైన్స్ ద్వారా మూఢ నమ్మకాలు, మూఢాచారాలు దూరమవుతాయని జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి సమీర్‌బాష తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో కడప నగర విద్యార్థులకు స్థానిక ఆర్కే నగర్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రుజువు చేయలేని అంశాలను, వాస్తవాలను ఇతరులకు వివరించి ప్రజా చైతన్యం తెచ్చేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు లో కాస్ట్...నో కాస్ట్ అంశంపై సైన్స్ ప్రయోగాలను చేసి చూపించారు. మరికొన్ని విద్యార్థులతో చేయించారు. జేవీవీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైన్స్ అంటే తెలియని విషయాలను తెలుసుకోవడమేనని, క్రమబద్ధమైన జ్ఞానమని, కేవలం నమ్మకాలు, ఊహలతో విషయ జ్ఞానం సంపాదించడం కాదని తెలిపారు. మెజీషియన్ సమీర్‌బాష చేతిలో కర్పూరాన్ని వెలిగించడం, నోటిలో నుంచి శివలింగాన్ని తీయడం లాంటి ఆసక్తికరమైన ఇంద్రజాల అంశాలను ప్రదర్శించారు. వీటిలో కేవలం సైన్స్, హస్తలాఘవం మాత్రమే ఉన్నాయని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన విషయాలు నేర్పి నినాదాలు చేయించారు.



చేతిలో కర్పూరాన్ని వెలిగించి చూపుతున్న సమీర్‌బాష

మార్గదర్శకాలను అనుసరించి డ్యూటీ వేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : డ్రైవర్లు, కండక్టర్లకు ఫిక్స్‌డ్ చార్టు వేసేందుకు ఆర్టీసీ ఎండీ మార్గదర్శకాలను ఇచ్చారని, ఆ మేరకు డ్యూటీ చార్టులు వేయాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బాల వెంకటేశ్ కోరారు. శుక్రవారం డిపో మేనేజర్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండక్టర్ల చార్టు నుంచి నాలుగు ఖాళీలు ఏర్పడ్డాయని, వాటిని పూరించి కొత్త చార్టు వేసి అమలు చేయాలన్నారు. స్కూలు బస్సులను, జెడ్‌డబ్ల్యుఎస్ బస్సులను ఆర్టీసీ డ్రైవర్ల చేత నడపాలని సూచించారు. డ్యూటీలు లేక స్పెయిర్‌లో ఉన్న కండక్టర్లు, డ్రైవర్లకు బలవంతపు సెలవులు ఇవ్వడానికి స్వస్తి పలకాలన్నారు. వారిని ఎక్కడైనా అవసరమైనచోట పని చేయించుకుని మస్టర్ ఇవ్వాలని కోరారు. ఏఎంఎఫ్ యూనియన్ పక్షపాత వైఖరిని మానుకోవాలని, అలాగే ఏఎంపీ నిరంకుశ పాలన విడనాడాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను పారదోలాలని, పనిచేసి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. పై సమస్యలను పరిష్కరించనట్లయితే జూన్ 7, 8, 9 తేదీలలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామని, 9, 10 తేదీలలో టీ విరామ సమయంలో గేట్ మీటింగ్ జరుపుతామని, 11, 12 తేదీలలో కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి అవకాశాలు

కమలాపురం : పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ కళాశాలలో జాబ్ అచీవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న 12 మందికి కొప్పర్తిలోని డిక్సన్ పరిశ్రమలో ఉపాధి లభించింది. వారికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీడీఓ జ్యోతి, నగర కమిషనర్ రాముడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ కోర్సు చేయడంతో చిన్న వయసులోనే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే బి.టెక్‌లో డైరెక్ట్‌గా సెకండియర్ చదవవచ్చన్నారు. తమ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ కోర్సులు ఉన్నాయన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ కళాశాలలో ఏ కోర్సులోనైనా నేరుగా చేరవచ్చన్నారు. ఎంపీడీఓ, కమిషనర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులకు మంచి ఆదరణ ఉందన్నారు. ముఖ్యంగా చిన్న వయసులోనే ఉపాధి అవకాశాలు పొందడంతోపాటు ఉన్నత విద్య కూడా అభ్యసించవచ్చన్నారు. పాలిటెక్నిక్ విద్య చదువుతుండగానే ఈ కళాశాలకు చెందిన 12 మందికి ఉపాధి లభించడం హర్షణీయం అన్నారు. అలాగే మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించే అవకాశం ఉందని, అందులో విద్యార్థులందరికీ ఉపాధి అవకాశం వస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకున్న వారితో ప్రిన్సిపల్, ఎంపీడీఓ, కమిషనర్

నేడు రేణుకా యల్లమాంబ కల్యాణం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లెలో వెలసిన రేణుకా యల్లమాంబ కల్యాణం శనివారం జరుపనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. రేణుకా యల్లమాంబ తిరునాల సందర్భంగా శనివారం సాయంత్రం జగజ్జనని రేణుకా యల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవంలో భాగంగా అమ్మవారికి గణపతిపూజ, పుణ్యహావాచనం, యజ్ఞోప విధారణ, కంకణాధారణ, మాంగళ్యధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

వైభవంగా రథోత్సవం

గోపవరం : మండలంలోని గోపవరంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు రథాన్ని ముందుకు లాగుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.



గోపవరంలో వేణుగోపాలస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శేష వాహనంపై విహరించిన సుబ్రమణ్యేశ్వరస్వామి



సుబ్రమణ్యస్వామి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యస్వామి

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్షనారాయణుడు గజ వాహనంపై, అలాగే శ్రీవల్లి దేవసేన సమేత ద్వికందర సుబ్రమణ్యేశ్వరస్వామి శేష వాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఆలయ ప్రధాన సేవకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సాయినాథశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న మోక్షనారాయణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం మండప అర్చనలు, నారాయణ విష్ణు సూక్త పారాయణం, అభిషేకాలు, సుదర్శన హోమం, సాయంత్రం నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్షనారాయణుడు గజ వాహనంపై, శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు శేష వాహనంపై మాడ వీధుల్లో అత్యంత వైభవోపేతంగా ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. కాగా ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన వితరణ చేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

రామాపురం మోక్ష నారాయణస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన రాకను పురస్కరించుకుని ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ, స్వాముల చరిత్ర గురించి ఎమ్మెల్యే నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులను నిర్వాహకులు శాలువలతో సన్మానించారు.

అనంతరం మాడ వీధుల్లో స్వామి వార్ల ఊరేగింపు రథాలను ఎమ్మెల్యే లాగారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, మణికంఠ శర్మ, శ్రీనివాసులరెడ్డి, ఆర్‌వీఎన్ఆర్, జనార్ధన్‌రెడ్డి, కొండారెడ్డి, రాజారెడ్డి, క్రిష్ణారెడ్డి, చిన్నరాజారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తిరుమల్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రైడేని తప్పనిసరిగా పాటించాలి



గాండ్లవీధిలో డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : ప్రతి ఒక్కరూ ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని గాండ్లవీధిలో డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం రానున్న నేపథ్యంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒకసారి ఇంటిలోని కుండలు, బానలు, కూలర్లు శుభ్రపరుచుకోవాలన్నారు. ఇంటిలోని వ్యర్థ పదార్థాలను మురికి కాలువలో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే రోజు డ్రైడేగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మురికి కాలువలను శుభ్రం చేయాలని శానిటేషన్ సెక్రటరీని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, ఎంపీహెచ్ ఈఓలు ప్రసాద్, శంకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, వరదారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయు నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, బూట్లు తదితర వస్తువులను పాఠశాల పునః ప్రారంభం నాటికి స్కూల్ పాయింట్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో హెచ్ఎంలకు ఎటువంటి ఆర్థికభారం లేకుండా చూడాలని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డిలు అన్నారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఉర్దూ మీడియం పాఠశాలలకు తగినన్ని పాఠ్యపుస్తకాలు సరఫరా కావడం లేదన్నారు. అలాగే ఉర్దూ మీడియం, ఇంగ్లీష్ మీడియం కలిగి ఉన్న ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ మీడియంలోపాటు ఇంగ్లీష్ మీడియం చదివే విద్యార్థులకు సెకెండ్ లాంగ్వేజ్‌గా ఉన్న తెలుగు పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు సరఫరా కావడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మునిసిపల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు



కడప కల్చరల్ : కడప నగరం మృత్యుంజయ కుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ హుండీ సొమ్మును శుక్రవారం లెక్కించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్ పర్యవేక్షణలో ఆలయ ఈఓ, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ అధికారి ఎ.శ్రీధర్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన అర్చకులు ఎన్.సతీష్ శిధర్, ఇతర సభ్యులు హుండీలోని మొత్తాన్ని లెక్కించారు. మార్చి 13 నుంచి ఇప్పటివరకు మొత్తం రూ. 42,475 నగదు లభించిందనివారు తెలిపారు.

ఘన సన్మానం



ఏపీజీబీ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్‌ను సత్కరిస్తున్న శివశంకర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు తన ఖాతాదారులకు విశేష సేవలు అందించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ జి.శివశంకర్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన ఏపీజీబీ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సేవల గురించి వివరించారు. రక్తదానం గురించి అవగాహన కల్పించడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, మొక్కలు నాటే కార్యక్రమం, ఆరోగ్య శిబిరాలు తదితరాలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా చేపట్టేందుకు గ్రామీణ బ్యాంకు సహాయ సహకారాలు అవసరమని కోరామన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ కూడా గ్రామీణ బ్యాంకు వ్యాపారాభివృద్ధిలో తమవంతు సహకారం అందిస్తుందన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు



వివిధ పార్టీల నాయకులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సుధాకర్

చెన్నూరు : ఎన్నికల కోడ్ జూన్ ఆరవ తేదీ వరకు అమలులో ఉంటుందని, ఎవరైనా గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమలాపురం నోడల్ అధికారి, డీఎస్పీ ఎం.సుధాకర్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీ సీటర్స్, సస్పెక్ట్స్, ట్రబల్ మాంగర్స్, రాజకీయ నాయకులకు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అందరికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున ఇరువర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి రెచ్చగొట్టే ప్రయత్నాలు ప్రసంగాలు చేయకుండా, అలాగే టపాసులు ఊరేగింపులు నిర్వహించకుండా ఉండాలని సూచించారు. అంతేకాకుండా ఎన్నికల కోడ్ ఉన్నందున 144 సెక్షన్‌తోపాటు 30 యాక్ట్ అమలులో ఉంటుందని ఎవరూ కూడా రోడ్లపై గుంపులుగా ఉండరాదని, ఎవరి ఇళ్లలో వారు ఉండాలని తెలిపారు. కౌంటింగ్ తర్వాత ఎవరైనా రెచ్చగొట్టే విధంగా చేసినా, గొడవలకు, ఘర్షణలకు పాల్పడినా అలాంటి వారిని ఉపేక్షించేది లేదని కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఐ పార్థసారథి, చెన్నూరులోని వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

కమలాపురం : కమలాపురం సబ్‌జైలులో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలను ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి పరామర్శించారు. సార్వత్రిక ఎన్నికల రోజున జరిగిన ఘర్షణల్లో ఖాజీపేట, చాపాడు మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు కమలాపురంలో సబ్‌జైలులో ఉన్నారు. శుక్రవారం రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

కేవైసీ చేయించుకోవాలి

వల్లూరు : వల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాలు పొందిన వారితోపాటు, సభ్యత్వం కలిగిన ప్రతి సభ్యుడు కేవైసీ చేయించుకోవాలని పీఏసీఎస్ సీఈవో రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని సహకార సంఘాలన్నీ కంప్యూటరీకరణ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి సభ్యుడు కేవైసీ చేయించుకోవాలని ఆయన పేర్కొన్నారు. త్వరలో సహకార సంఘాల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేవైసీ చేయించుకోకపోతే సభ్యత్వం కోల్పోతారని తెలిపారు. వాటితోపాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు అందకుండా పోయే అవకాశం వుందని తెలిపారు. కావున ప్రతి సభ్యుడు తమ ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబరును వల్లూరులోని పీఏసీఎస్ కార్యాలయంలో అందచేసి కైవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సాగుకు సహకరించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో నిర్వహించిన ఏఈఓ, వీఏఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావచ్చిందని, ఈ ఏడాది జూన్‌లోనే వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. అందుకే ఇప్పటికే పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేశామన్నారు. అలాగే మరి కొన్ని ప్రాంతాల్లో వేరుశనగ విత్తనాలు కూడా పంపిణీకి సిద్ధం చేశామన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు శనగ, మినుము, పత్తి తదితర వాటితోపాటు ఎరువులు సంబంధిత ఆర్‌బీకేల్లో సిద్ధం చేశామన్నారు. కావలసిన రైతులు ఆర్‌బీకే సిబ్బందిని కలసి విత్తనాలు, ఎరువులు తీసుకెళ్లాలన్నారు. అలాగే రైతులు సాగు చేసే విత్తనాలు, ఎరువులను కమలాపురంలోని ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షించుకోవచ్చన్నారు. వ్యవసాయ సిబ్బంది సైతం తమ ఉత్పత్తులను పరీక్షించుకునేందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. అప్పుడే ల్యాబ్‌లకు విలువ పెరుగుతుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి సాగుకు సిద్ధం చేయాలన్నారు. రైతులు ఒక్క సీజన్ కోల్పోయినా చాలా నష్టపోతారన్నారు. మీరు రైతులకు సాగు కాలం పట్ల అవగాహన కల్పిస్తే మేలు చేసిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఏఓలు శ్రీకాంత్‌రెడ్డి, శ్యాంబాబు, సాయిజ్యోతి, సంతోషిణి, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

చిన్నకొత్తపల్లెలో నాకాబందీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్, పోలీసు సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. అనుమానం ఉన్న ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం వారు గ్రామస్తులతో మాట్లాడుతూ ఎలక్షన్‌తో సంబంధం లేకుండా గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా గ్రామస్తులు సహకరించాలన్నారు. గొడవలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.